క్లుప్తంగా

టెండర్ల ప్రక్రియలో జాప్యమేల..!

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచినప్పటికీ ఆ టెండర్ల ప్రక్రియ నిలిచిపోయినట్లుగా తెలుస్తుంది. గత నెల జూన్ మాసంలో చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, ఓపెన్‌జిమ్‌ల కోసం టెండర్లు పిలువగా ఇప్పటివరకు కూడా దాదాపు నెల దాటినా అవి ఓపెన్ చేయలేదని సమాచారం. టెండర్‌లో పాల్గొన్న సదరు కాంట్రాక్టర్లు ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసినప్పటికీ సరైన సమాధానం రావటంలేదని టెండర్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారో స్పష్టత నివ్వకుండా దాటవేస్తున్నారని తెలుస్తుంది. టెండర్లు తెరువటంలో.. పనులు ప్రారంభించటంలో జాప్యం జరుగకుండా చూస్తూ ఇప్పటికే వెనుకబాటుకు గురైన పట్టణంలో అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ప్రజలు భావిస్తున్నారు.

ఉపాధ్యాయురాలి ఉదారత

జన్నారం: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం రేండ్లగూడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గుండ శ్రీలత రెండు 43ఇంచుల టీవీలను విరాళంగా ఇచ్చి ఉదారత చాటుకున్నారు. ఎంఈవోకు టీవీలను అందజేశారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామమైన పెగడపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద బస్టాప్, ఒక్క బోరు ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేద్కర్ యువజన సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పవర్ ప్లాంట్ జీఎం శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో యువజన సమితి నాయకులు రవి, రవితేజ, సాయికిరణ్, గట్టు మల్లేశ్, పాపయ్య తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందిస్తున్న రాజేశ్వర్‌రావు

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్టీయూ ముందుంటుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి పానుగంటి లచ్చన్న, నాయకులు బోయిని శ్రీనివాస్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: ఏరియా వర్క్‌షాప్ నుంచి అవుట్ డోర్ పనుల కోసం కేటాయించే ఉద్యోగులకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్ డిమాండ్ చేశారు. వర్క్‌షాపులో పలు సమస్యలపై మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వర్క్‌షాపులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఈ నాగరాజ్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు వర్క్‌షాపు ఉద్యోగులు ఉన్నారు.

ఐటీఐ కళాశాలను రద్దు చేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో కనీస సౌకర్యాలు లేకుండా నడపుతున్న ఓ ప్రైవేట్ ఐటీఐ గుర్తింపును రద్దు చేయాలని మంగళవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐటీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థుల కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ల కోసం వస్తే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీ గౌడ్, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

మందమర్రికి ఎన్నికలు జరిపించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి పాలకవర్గం లేక అభివృద్ధి జరగడం లేదని, వెంటనే మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలని కోరుతూ మంగళవారం మున్సిపాలిటీ ఎన్నికల సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో సీఎం కార్యాలయం అడ్రస్ పేరిట నాయకులు ఉత్తరాలు పోస్ట్ చేశారు.

నీరంతా వృథా..!

- మత్తడి వాగు వరదతోనే రాముని చెరువు కింద పంటల సాగు
- చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో శిథిలావస్థకు వరద కాలువ
- కాలువ తెగి చెరువును చేరని వరద
- స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని గ్రామస్తుల వేడుకోలు
- సిమెంట్ లైనింగ్‌తో మరమ్మతులు చేపట్టాలని వినతి



వాగుకు అడ్డుగా కట్టిన మత్తడి



వాగుపై కట్టిన చెరువుకు వెళ్లే కాలువ

జన్నారం: మండలంలోని ఏకైక ఏజెన్సీ గ్రామం కవ్వాల్. కవ్వాల్‌లోని రామునిచెరువు నీటితో రైతులు పంటలు పండించుకుంటారు. చెరువు కింద 200మంది రైతులు సుమారు 1000ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. కడెం కెనాల్ సౌకర్యం లేని ఆ గ్రామంలో రైతులకు ఆధారం ఆ చెరువు. పూర్వం కడెం కెనాల్ ఆ గ్రామ సమీపం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోనే నిర్మించారు. కానీ కెనాల్ నీరు ఆ గ్రామానికి వచ్చేలా ఏర్పాటు చేయలేదు. గ్రామ రైతులకు వర్షం పడి చెరువు నిండితే పంటలు పండినట్లు, లేదంటే పస్తులుండాల్సిందే. ఇలాంటి గ్రామానికి మత్తడి వాగు జీవనాధారంగా మారింది. కానీ అనేక సమస్యలతో వ్యయ ప్రయాసాలకోర్చిస్తే తప్పా, మత్తడి వాగు నుంచి చెరువులోకి నీరు రాదు. దశాబ్దాల కాలం క్రితం చెరువు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో పారే వాగుకు అడ్డంగా మత్తడి నిర్మించారు. వాగునీటికి అడ్డుగా ఉన్న మత్తడికి తాకిన నీరు.. పక్క నుంచి కాలువ గుండా చెరువులోకి చేరుతుంది. ఆ సమయంలోనే వాగు నుంచి చెరువుకు నీరు చేర్చే కాలువ పకడ్బందీగా నిర్మించారు. కానీ ప్రస్తుతం ఆ కాలువ శిథిలావస్థలోకి చేరింది.

మత్తడితో నిలువెత్తు నీరు..

వాగుకు అడ్డుగా నిలువెత్తు మత్తడి నిర్మించడంతో వాగు ప్రవాహం ఆగి, నీరు కాలువ గుండా చెరువులోకి చేరుతుంది. వర్షం లేకున్నా పారే వాగులో మత్తడి నిర్మించిన చోట నిలువెత్తునీరు నిలువ ఉంటుంది. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే, నిలువ ఉన్న నీరు కాలువ గుండా చెరువులోకి చేరే అవకాశం ఉంది. కాలువ పనులపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల సమస్య ఏర్పడింది. కాలువ సరిగ్గా లేకపోవడం వల్ల నీరు వృథాగా పోతోంది. తిరిగి నీరు వాగులోనే కలుస్తుంది. అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే గ్రామంపై దృష్టి సారించి చెరువుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కాలువ తెగి వృథాగా నీరు..

దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువ శిథిలావస్థలోకి చేరి మట్టి కట్టలే మిగిలాయి. ఉపాధి హామీ పథకం కింద కాలువ ఇరువైపులా మట్టి పోయించినా ఫలితం లేదు. వర్షానికి వాగు ఉప్పొంగి కాలువ గుండా నీరు పారుతున్నా, కాలువ తెగి నీరు వృథాగా పోతోంది. చెట్లు, పొదలతో నిండి ఉన్న కాలువలో చెత్త, చెదారం తట్టి నీటికి అడ్డు పడుతోంది. దీంతో కాలువ తెగిపోయి నీరంతా పొలాల్లోకి, చేళ్లలోకి వృథాగా పారుతోంది. ఈ కాలువను కిలోమీటర్ వరకు సిమెంట్‌తో నిర్మిస్తే, రెండు రోజులు వర్షం కురిస్తే వాగు ఉప్పొంగి నీరు చెరువులోకి చేరే అవకాశం ఉంది. చెరువు నిండితే ఖరీఫ్, రబీ పంటలు సాగవుతాయి. ఇలాంటి సమస్యల్లో ఉన్న గ్రామ రైతులపై అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు కానీ దృష్టి సారించడం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే అయినా దృష్టి సారిస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో గ్రామ రైతులు ఉన్నారు.

ప్రతిసారీ గోసపడుడే..



వానాకాలం రాంగానే రైతులందరం మత్తడి వాగు వద్దకు పోతాం. కాలువలో చెత్త, ముళ్లపొదలను శుభ్రం చేస్తాం. లేకుంటే వానలకు నీళ్లు చేరి కాలువ తెగి నీళ్లు వృథాగా పోతాయి. నడుం మంటి నీళ్లలో దిగి పొదలను తొలగించుకుంటాం. ఏటా ఇదే గోస మాది. ఇప్పటికైనా అధికారులు మా గోస చూసి సిమెంతో కాలువ నిర్మాణం చేయాలి. – కండ్లె దుబ్బయ్య, రైతు

ఎమ్మెల్యే దృష్టి పెట్టాలే



ఎన్నో ఏళ్లుగా చెరువులోకి నీరు చేరడానికి మత్తడి వాగు వద్దకు వచ్చి శుభ్రం చేసుకుంటాం. శాశ్వత పనులు జరిగితే నీళ్లకు ఇబ్బంది ఉండదు. రెండు, మూడు వర్షాలకే చెరువు నిండుతుంది. ఇలాంటి మత్తడి కాలువకు శాశ్వత పరిష్కారం చూపాలి. మా ఎమ్మెల్యే మాపై దృష్టి సారించి, నిధులు మంజూరు చేసి పనులు చేపించాలి.
– రంగు వెంకటేశ్, రైతు

అటవీశాఖ అనుమతి కావాలి

మత్తడి వాగు ద్వారా కవ్వాల్‌లోని రాముని చెరువులోకి నీరు చేరుతుంది. చెరువు నిండితే తలుపు మూసుకుంటే సరిపోతుంది. కానీ కాలువ నిర్మాణం బాగలేక నీరు పోతుంది. ఈ సమస్యను పలువురు రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. ప్రతిపాదనలు పంపిస్తాం. అటవీశాఖ అనుమతి కావాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తెలియజేస్తాం.
– రాజు, జేఈఈ

తపాలాశాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఖాతా బుక్కులు అందజేస్తున్న తపాలాశాఖ ఏఎస్పీ

చెన్నూర్‌రూరల్: తపాలాశాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ రాథోడ్ రామారావు కోరారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. పోస్టాఫీస్‌లలో సేవింగ్ అకౌంట్, ఇన్సూరెన్స్ పాలసీ వలన కలిగే లాభాలతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సంవృద్ధి ఖాతాల గురించి వివరించారు. కార్యక్రమంలో చెన్నూర్ పోస్ట్‌మాస్టర్ లక్ష్మీనారాయణ, అంగ్రాజ్‌పల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రాజన్న, చెన్నూర్ పట్టణ పీఎం గుర్రం మహేశ్, మెయిల్ ఓవర్సీలు శ్రావణ్, భరత్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



వంటలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏడో రోజు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలైన ప్రొటీన్‌లతో కూడిన ఆహార పదార్థాలు తయారు చేసుకొచ్చి ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య పోషకాలు కలిగిన ఆహారపదార్థాల గురించి వివరించి, వీటి ద్వారా భవిష్యత్‌లో విద్యార్థులకు వాటి ప్రయోజనాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులెన్ని?'



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించిందో బీజేపీ నేతలు ప్రజలకు బహిరంగ పర్చాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రులు ఎన్ని పథకాలు తీసుకొచ్చారని, రాష్ట్రానికి గాని, మంచిర్యాల నియోజకవర్గానికి గాని ఎన్ని నిధులు కేంద్రం నుంచి వచ్చేలా చేశారో బీజేపీ నేతలు ప్రజలకు వివరించాలన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వరదలు రాకుండా కరకట్టకు, ఎత్తిపోతల పథకం, మాతాశిశు ఆసుపత్రి నిర్మాణంతో పాటు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు తెచ్చారన్నారు. ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి నిధులను కేటాయిస్తుండగా, బీజేపీ నేతలు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'పై అవగాహన

జైపూర్: జైపూర్, భీమారం మండలాల పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతి పౌరుడు ఒక్కో ఇన్నోవేటర్ కావాలని, మన పనిని సౌకర్యంగా చేసుకునేందుకు తమ కొత్త ఆలోచనలను ఆగస్టు 3లోగా తెలియజేయాలని, అందుకు అనుగుణంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కో–ఆర్డినేటర్ రాకేశ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



భీమారంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమారం/జన్నారం/మందమర్రిరూరల్/తాండూర్/చెన్నూర్‌రూరల్: రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. పంట రుణాలను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా నెరవేస్తున్నట్లు సీఎం ప్రకటించగా రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రెండో విడత రుణమాఫీకి నిధులు మంజూరు చేయడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

తాగునీరు వృథా..!



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఐబీ ఆవరణలో గల వాటర్ ట్యాంకు డిస్ట్రిబ్యూషన్ వాల్ పాడవడంతో ట్యాంకులోని నీరు వృథాగా రోడ్డుపైకి పోయింది. డిస్ట్రిబ్యూషన్ వాల్‌కు మరమ్మతులు చేసేందుకు స్కాలర్‌వాల్‌ను విప్పడంతో ట్యాంకులోని నీరు ఖాళీ కాగా, ఐబీ చౌరస్తా నుంచి చింతపండు వాడ వరకు తాగునీరు రోడ్డుపై వృథాపోయింది. దీంతో ఐబీ ఏరియాతో పాటు, పద్మశాలీనగర్, ఎల్ఐసీ కాలనీ, సంజీవయ్య కాలనీ, చింతపండు వాడ, మేదరివాడ ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

సమస్యలపై చర్చ జరిగేనా..?



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం

- నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. ప్రతి నెలా ఆనవాయితీగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నా, పుర ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు. ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కనీసం ఈసారి జరిగే సర్వసభ్య సమావేశంలోనైనా సమస్యలు ప్రస్తావనకు వచ్చి పరిష్కారానికి నోచుకుంటాయా లేక ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నాలుగేళ్ల పదవీ కాలం గడిచినా పుర ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని నెలల కాలపరిమితి మాత్రమే మిగిలి ఉండటంతో కనీసం ప్రధాన సమస్యలపైన చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇతర సమస్యలు...

- మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా వీటి పరిధిలో ఉన్న ప్రధాన, అంతర్గత రోడ్లు చెదిరిపోయి, గుంతలు ఏర్పడి కంకర పైకితేలి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ఉన్నాయి.
- సెంట్రల్ లైటింగ్ సిస్టం సరిగ్గా అమలు కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే లైట్లు వెలుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతోంది. అన్ని ప్రాంతాల్లోనూ సెంట్రల్ లైటింగ్ కాంతులు వెదజల్లాల్సి ఉన్నా పట్టింపు చేయడం లేదు.
- మున్సిపాలిటీ వ్యాప్తంగా మురుగునీటి కాలువలు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. పూడిక నిండి మురికి నీరు స్థిరంగా నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. మురికి కాలువల్లో పూడిక తీయించడానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు.
- చెత్తను తీసుకెళ్లే కొత్త ట్రాలీలు సైతం ఇటీవలీ కాలంలో మరమ్మతులకు వచ్చాయి. వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించకపోవడంతో రోజువారీగా వార్డుల నుంచి చెత్త సేకరణ చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- మున్సిపాలిటీలో పార్కులు అతీగతి లేకుండా ఉన్నాయి. శాంతిఖని బస్తీలో ప్రతిపాదించిన పార్కు ఏళ్ల తరబడి నుంచి కాగితాల్లోనే మగ్గుతోంది. కన్నాల బస్తీ, బెల్లంపల్లి బస్తీలో ఏర్పాటు చేసిన పార్కుల నిర్వహణ సరిగ్గా లేక చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం కలిగించడం లేదు. తగిన ఆటవస్తువులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటోంది.
- బజారు ఏరియాలో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని గుర్తించాల్సి ఉండగా, ఏళ్లు గడుస్తున్నా ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో రోడ్డు పక్కన, షాపుల ముందు అనివార్యంగా వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఆయా సమస్యలపై సాధారణ సర్వసభ్య సమావేశంలో చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని పుర ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

జాడలేని గోదారి జలాలు..

పుర ప్రజలకు గోదారి జలాల సరఫరా ఏళ్ల తరబడి నుంచి జరగడం లేదు. మందమర్రి–బెల్లంపల్లి మున్సిపాలిటీలకు సంయుక్తంగా ఓ నీటి పథకం, ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లి మున్సిపాలిటీకి నేరుగా తాగునీటిని సరఫరా చేయడానికి మరో నీటి పథకాన్ని మంజూరు చేసిన వాటిలో ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదు. ఆ రెండు గోదారి నీటి పథకాలు బందయ్యాయి. వీటి స్థానంలో మిషన్ భగీరథ పథకం ద్వారా అడ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేస్తున్నా, ఆ నీటిని పుర ప్రజలు తాగలేకపోతున్నారు. తలాపున ఉన్న గోదారి నుంచి సరఫరా చేయాలని ఎప్పటికప్పుడు డిమాండ్ చేస్తున్నా, అమలుకు నోచుకోవడం లేదు.

'పార్టీ బలోపేతంపై మరింత దృష్టి'

దండేపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలోపేతంపై మరింత దృష్టిసారించి, అన్నీ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పనిచేయాలని, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడా రు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల బలోపేతంపై చర్చించినట్లు త్రిమూర్తి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఎన్టీఆర్‌నగర్‌లో ఫాగింగ్

సాక్షి ఎఫెక్ట్..



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: ఈ నెల 22వ తేదీన 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో 7వ వార్డు ఎన్టీఆర్‌నగర్ కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫాగింగ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వారం రోజుల పాటు వర్షం కురవడంతో ఫాగింగ్ చేసేందుకు వీలులేక, మంగళవారం కాలనీలో ఫాగింగ్‌ను నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీలోని 36వార్డుల్లో ఫాగింగ్‌ను చేపట్టి, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

'ఆసుపత్రి మూసేయకుండా నిరవధిక పోరాటం'

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆసుపత్రిని కాపాడుకునేందుకు నిరవధిక పోరాటం సాగించాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ప్రకటించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, శ్రేణులు పాల్గొని ఏరియా ఆసుపత్రిని రక్షించుకునే చర్యల గురించి చర్చించారు. ఏరియా ఆసుపత్రిని మూసివేసేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోందని, ఎలాగైనా సరే ఆ నిర్ణయం అమలు జరగకుండా అడ్డుకోవాలని పరిరక్షణ కమిటీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఆసుపత్రిని మూసివేయకుండా సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పరిరక్షణ కమిటీ నాయకులు చిప్ప నర్సయ్య, సిద్ధంశెట్టి రాజమొగిలి, ఓజియార్, దాగం మల్లేష్, ఎండీ చాంద్‌పాషా, గోగర్ల శంకర్, గెల్లి జయరాం, ఎండి.అఫ్జల్, డీఆర్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శిక్షణ శిబిరం

తాండూర్: ఉపాధ్యాయులు జాతీయ సాధనసర్వే 2024పై తగిన అవగాహన పెంచుకో వాలని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

తాండూర్: తాండూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో పి.శ్రీనివాస్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంపీపీ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు దగ్గరుండి వడ్డించారు. బ్రాహ్మణవాడలో రోడ్డుపై నిలిచిన, ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న బురద, మురికి నీటిని పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బందితో కచ్చానాళి తవ్వించి తొలగించే చర్యలు చేపట్టారు. మురికి నీటి కాలువలు, గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు. పోస్టాఫీసుకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలో పోలీసులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానాలు ఉంటాయని హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ అన్నారు.